చర్చలు.. తీర్మానాలు

అర్థవంతంగా సాగిన మండల పరిషత్ సమావేశం


సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ మధుపాడ నాగమణి, ఎంపీడీవో వెంకటరావు

సింహాచలం: పెందుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం అర్థవంతంగా సాగింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మధుపాడ నాగమణి అధ్యక్షత జరిగిన సమావేశంలో విభాగాల వారీగా ఉన్న పలు సమస్యలపై చర్చించారు. ఎంపీడీవో వెంకటరావు, వైస్ ఎంపీపీ దాడి వరలక్ష్మి, ఎంపీటీసీలు గండి హిమబిందు, గొల్లవిల్లి రమణ, స్వప్న, సర్పంచ్‌లు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

➡ పెందుర్తి మండలంలో పీహెచ్‌సీ లేకపోవడంతో వైద్య సేవలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ఈవిషయంపై ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను కలవాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

➡ రాంపురం నుంచి అక్కిరెడ్డిపాలెం వరకు ఉన్న ప్రధాన మార్గం అస్తవ్యస్తంగా ఉండటంతో రోడ్లు బాగుచేయాలని తీర్మానించారు.

➡ పసువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ అధికారులు సూచించారు.

➡ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రైవేటు స్కూల్స్‌లో 25 శాతం సీట్లు ఇవ్వాలన్న జీవో ఉందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని, ఏమైనా సందేహాలు ఉంటే తమని కలవాలని అధికారులు సూచించారు.

➡ జంగాలపాలెంలో పంచాయతీ భవనం నిర్మాణం సగంలోనే నిలిచిపోయిందని, కూర్చోవడానికి సరైన స్థలమే లేదని సర్పంచ్ గొరపల్లి నరసింగరావు ప్రశ్నించారు. అలాగే కొండపై నంచి వర్షపునీరు వచ్చి గ్రామంలోకి చేరుతోందని, దాన్ని నివారించాలని కోరారు.

➡ సరిపల్లిలో గ్రామ సచివాలయ భవనం నిర్మించినా ప్రారంభించకపోవడంతో కల్యాణమండపంలోనే కొనసాగుతోందని సర్పంచ్ గొర్లె రామకృష్ణ, ఎంపీటీసీ గొల్లవిల్లి వెంకటరమణ అన్నారు. తక్షణమే భవనాన్ని ప్రారంభించాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువుల్లో పనులు చేస్తున్నారుగాని ఫీడర్ స్కానర్‌లు లేవని, వాటిని ఏర్పాటు చేయాలని సూచించారు.

➡ జెర్రిపోతులపాలెంలో రైతుభరోసా కేంద్రం నిర్మాణానికి శంకు స్థాపనచేశారని, ఆ తర్వాత చింతగట్ల పంచాయతీకి భవనం నిర్మాణాన్ని మార్చుచేశారని... శిలాఫలకం ఒక చోట, భవనం మరో చోట ఉందని సర్పంచ్ అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేశారు.

➡ గ్రామాల్లో ఏ అభివృద్ధి పనులు జరిగినా, ఎవరైనా పర్యటనలకు వచ్చినా అధికారులు తమకు సమాచారం ఇవ్వడం లేదని అధికారుల తీరుపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అసంతృప్తి వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

నేడు పరవాడలో రక్తదాన శిబిరం

పరవాడ: ఓనస్ ఫౌండేషన్ రెండో వార్షికోత్సవం సందర్భంగా టీం ఓనస్, జీహెచ్ఎస్ ఆధ్వర్యంలో జైహనుమాన్ యూత్ సహకారంతో పరవాడ బాలికల జెడ్పీ పాఠశాల ఆవరణలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు జైహనుమాన్ యూత్ సభ్యుడు శ్రీను చెప్పారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే రక్తదానం శిబిరంలో యువకులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఎన్ఎంఎంఎస్‌లో సబ్బవరం హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో అప్పలరాజు తదితరులు

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్(ఎన్ఎంఎంఎస్)లో ప్రతిభ చూపారని మండల విద్యాశాఖాధికారి ఎస్. అప్పలరాజు తెలిపారు. 8వ తరగతి చదువుతున్న నక్క సత్యప్రసాద్,మారెడబూడి టీన్స్ ప్రియ, పోతల చరిష్మా, నక్క షాలోమి ఫ్లోరెన్స్, గంపరాయి కీర్తి ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరికి ఇంటర్ వరకూ ఏడాదికి రూ.12 వేలు చొప్పున ఉపకార వేతనం అందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈవో తోపాటు హెచ్ఎం చిన్నమ్మాయి,ఉపాధ్యాయులు,పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు.

అలరించిన నృత్యాలు


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

సింహాచలం: పెందుర్తి మండలం పినగాడిలోని విస్టం ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు డ్యాన్స్‌తో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అలాగే విభాగాల వారీ గా విద్యార్థులకు వారం రోజులపాటు నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మళ్ల విజయప్రసాద్, డైరెక్టర్ అనూష విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ జాషువా, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, పీడీ బి.రమణారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్టీల్‌ప్లాంట్ ట్రైనింగ్ క్యాలెండర్ ఆవిష్కరణ


ట్రైనింగ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎండీ అతుల్‌భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ 2023–24 ట్రైనింగ్ క్యాలెండర్‌ను శనివారం ఉక్కు ప్రధాన పరిపాలన భవనంలో సీఎండీ అతుల్‌భట్ ఆవిష్కరించారు. స్కిల్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ, కంప్యూటర్, భద్రత, ఆరోగ్యం తదితర అంశాలపై ఉద్యోగులకు ఇవ్వనున్న కార్యక్రమాలతో కూడిన వివరాలతో క్యాలెండర్‌ను రూపొందించారు. క్యాలెండర్‌ను రూపొందించిన ట్రైనింగ్ కమిటీని అభినందించారు. కార్యక్రమంలో సీజీఎం జి. గాంధీ, ట్రైనింగ్ విభాగాధిపతి ఎస్. భాను తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నీటి దినోత్సవం


విభాగం అధికారులకు షీల్డు అందజేస్తున్న సీజీఎం మహంతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ప్రపంచ నీటి దినోత్సవ వేడుకలు శనివారంతో ముగిశాయి. 23 నుంచి 25 వరకు మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన వేడుకల్లో వివిధ పోటీలు నిర్వహించారు. శనివారం ఈడీ (వర్క్స్) కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన ముగింపు వేడుకల్లో సీజీఎం (వర్క్స్) బి.కె. మహంతి ముఖ్య అతిథిగా హాజరై నీటి పొదుపు పాటించిన విభాగాలకు షీల్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఏయూ ప్రొఫెసర్ డాక్టర్ వి. శ్రీదేవి, కెమ్ బాండ్ ప్రతినిధి అనూప్ రంజన్ నీటి నిర్వహణ విధానాల గురించి వివరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు


కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 నుంచి అర్చకులు కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలు అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు రఘునాథ్, శ్రీకాంత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా రాములోరి పెళ్లిరాట


సీతారాముల పెళ్లి రాట కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు

పరవాడ: తానాం గ్రామంలో ఈ నెల 30న నిర్వహించనున్న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో భాగంగా స్థానిక రామాలయం వద్ద పెళ్లి రాట కార్యక్రమాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కన్నూరి దేవి వెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైల జగన్నాథరావు, ఉప సర్పంచ్ వర్రి మంగలక్ష్మి వసంతరావు, వార్డు సభ్యులు చీపురుపల్లి శ్రీను, సతీష్, పైల జానకీరావు, వర్రి వెంకటరమణ, జి.సన్యాసిరావు, ఆర్. అప్పారావు, పైల అప్పారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ పైల కృష్ణారావు, బి.వి.ఎస్.గాంధీ, జి.ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


25జిపియల్92:పోషణ్ పక్వాడా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ బోకం సూర్యకుమారి


కార్యక్రమంలో పాల్గొన్న ఈవోఆర్డీ పద్మజ

సబ్బవరం: పౌష్టికాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని ఎంపీపీ బోకం సూర్యకుమారి తెలిపారు. మండలంలోని గుల్లేపల్లి సచివాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భవతులు, బాలింతలతో పాటు పిల్లలకు పౌష్టికాహారం అందిస్తుందన్నారు.బాలామృతం,సంపూర్ణ భోజనం,పాలు,గుడ్లు, వైఎస్సార్ కిట్లు పంపిణీ చేసి పోషకాహార లోపాన్ని, బాలింతల్లో ఏర్పడుతున్న రక్తహీనతను నివారించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బండారు శ్రీనివాసరావు,పంచాయతీ కార్యదర్శి బ్రహ్మ,సెక్టార్ సూపర్ వైజర్ సీహెచ్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులు, బాలింతల ఆరోగ్యంపై శ్రద్ధ

పరవాడ: గర్భిణులు, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మంచి పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం అందించాలని మండల పంచాయతీ విస్తరణాధికారి పద్మజ సూచించారు. ముత్యాలమ్మపాలెం అంగన్‌వాడీ కేంద్రం–1లో శనివారం నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పౌష్టికాహార విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా పుట్టబోయే పిల్లలు కాల్షియం లోపం లేకుండా మంచి ఆరోగ్యంతో జన్మిస్తారని సూచించారు. కార్యక్రమంలో ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు, పంచాయతీ కార్యదర్శి సోమునాయుడు, నాయుడుపాలెం పంచాయతీ కార్యదర్శి పోతల రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కేంద్రాల వర్కర్లు పాల్గొన్నారు.

రెండు కంటైనర్లు ఢీ

- ఒక డ్రైవర్ మృతి


ఘటన స్థలంలో మృతి చెందిన డ్రైవర్

మల్కాపురం: ఒకే మార్గంలో వెళ్తున్న రెండు కంటైనర్లు ఒకదానికొకటి ఢీ కొట్టడంతో వెనుక ఉన్న కంటైనర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం అర్ధరాత్రి (శనివారం తెల్లవారి) 2 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంపై మల్కాపురం సీఐ లూథర్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఝూర్ఖండ్ రాష్ట్రానికి చెందిన బహదూర్‌యాదవ్ కంటైనర్‌తో శ్రావణి షిప్పింగ్ నుంచి లోడ్‌తో శుక్రవారం రాత్రి శీలానగర్ మార్గం నుంచి మారుతీ సర్కిల్ రోడ్డు మీదిగా కాన్వెంట్ వంతెన వైపు వెళ్తున్నాడు.అదే సమయంలో ఈ కంటైనర్‌కు వెనుక బిహార్ రాష్ట్రానికి చెందిన శంభుసింగ్ స్థానికంగా గల గేట్ వేకు వెళుతున్నాడు. ఈ రెండు కంటైనర్లు ఐఎస్ఎస్ డేగా నుంచి హెచ్‌పీసీఎల్ పెట్రోపార్కు సమీపానికి వస్తున్న సమయంలో శంభుసింగ్ తన వాహనంతో బహదూర్‌యాదవ్ వాహనాన్ని వెనుక బలంగా ఢీ కొట్టాడు.ఈ ఘటనలోలారీ ముందు భాగం నుజ్జు నుజ్జు కావడంతో శంభుసింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మల్కాపురం పోలీసులు వివరాలను సేకరించి, బహదూర్‌యాదవ్‌ను అదుపులోకి తీసుకున్నారు. సీఐ లూథర్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్ర సర్వేతో భూ వివాదాలకు చెక్

అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ


రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

సబ్బవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా నిర్వహిస్తున్న సమగ్ర రీ సర్వేతో భూ వివాదాలకు చెక్ పడుతుందని అనకాపల్లి ఆర్డీవో చిన్ని కృష్ణ అన్నారు. సర్వే పూర్తయితే కచ్చితమైన కొలతలతో భూ వివరాలను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని సబ్బవరం,అసకపల్లి గ్రామాల్లో రెవెన్యూ బృందాలు నిర్వహిస్తున్న సమగ్ర రీ సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చిన్నికృష్ణ మాట్లాడుతూ అనేక సంవత్సరాల తర్వాత జరుగుతున్న ఈ రీ సర్వే వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సర్వే ఆఫ్ ఇండియా, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహిస్తున్న సర్వేలో కచ్చితమైన కొలతలు రికార్డుల్లో నమోదవుతాయని చెప్పారు..రైతులంతా అధికారులకు సహకరిస్తూ తమ కమతాలను దగ్గరుండి చూపించి సర్వే చేయించుకోవాలన్నారు. ఇప్పటి వరకూ పలు గ్రామాల్లో చేపట్టిన రీ సర్వే వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి కంప్యూటర్‌లో పొందుపరిచిన రీ సర్వే వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి. సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ వెంకట్,మండల సర్వేయర్ కర్రి శ్రీనివాసరావు,ఆర్ఐ వీరయ్య, వీఆర్వోలు శేషు,నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సింహాచలం: ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఒక అంగన్‌వాడీ కార్యకర్త, 15 అంగన్‌వాడీ సహాయకులు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. ఏప్రిల్ 3వతేదీ సాయంత్రం 5గంటల్లోగా పెందుర్తి శిశు అభివృద్ధి పథకపు అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. స్థానిక నివాసం కలిగి స్త్రీ 10వ తరగతి ఉత్తీర్ణత అయి ఉండాలని తెలియజేశారు. జూలై1, 2022 నాటికి 21 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలని తెలిపారు. ఇతర వివరాలకు ఐసీడీఎస్ ప్రాజెక్టు పెందుర్తి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి విరాళం


అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న పారిశ్రామికవేత్త పాండురంగప్రసాద్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో ముగ్గురు అమ్మవార్ల ఆలయాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. శ్రీ కుంచాలమ్మ, శ్రీ దుర్గాలమ్మ, శ్రీ ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాలకు పలువురు వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, గ్రామస్తులు భారీగా విరాళాలు అందజేస్తున్నారు. శనివారం అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డికి పారిశ్రామికవేత్త సజ్జా పాండురంగప్రసాద్, యోజన దీపిక దంపతులు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. విరాళ దాతకు ఆలయ కమిటీ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

ఆంధ్రా కురియన్ ఆశయ సాధనకు కృషి

విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్


సబ్బవరం యూనిట్ కార్యాలయం వద్ద తులసీరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ ఆనంద్ కుమార్


సమావేశంలో పాల్గొన్న పాడి రైతులు

సబ్బవరం: ఆంధ్రా కురియన్, ఆంధ్రప్రదేశ్‌లో క్షీర విప్లవం తీసుకొచ్చిన మహోన్నత వ్యక్తి ఆడారి తులసీరావు ఆశయాలను కొనసాగిస్తూ విశాఖ డెయిరీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ చెప్పారు. మండలంలోని పెదయాతపాలెం గౌరీ పరమేశ్వరుల ఆలయం సమీపంలో సుమారు రూ.35 లక్షల విశాఖ డెయిరీ నిధులతో నిర్మించిన కల్యాణ మండపంతో పాటు సబ్బవరం బల్క్ మిల్క్ సెంటర్, అక్కడ ఏర్పాటు చేసిన ఆడారి తులసీరావు విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ డెయిరీని తులసీరావు ఎంత గొప్పగా అభివృద్ధి చేశారో అంతకు మించి అభివృద్ధి బాటలో నడిపించడానికి తామంతా కృషి చేస్తామన్నారు. లక్షలాది మంది పాడి రైతులను తనకు కుటుంబంగా అందించారన్నారు. రోజుకు 10 లక్షల లీటర్ల పాల సేకరణ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని.. దీనికోసం ప్రతి పాడి రైతు 10 లీటర్లు పాలు పోయాలని ఆయన కోరారు. ఏప్రిల్ నుంచి రైతులకు 10 నుంచి 15 ఆవులు ఇచ్చే విధంగా కార్యాచరణ సిద్ధం చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎండీ ఎస్‌వీ రమణ, డీజీఎం డాక్టర్ పాండియరాజన్, డెయిరీ డైరెక్టర్లు శరగడం శంకరరావు, కోళ్ల కాటమయ్య, మలసాల రమణారావు, గేదెల సత్యనారాయణ, రెడ్డి రామకృష్ణ, దాడి పవన్ కుమార్, శీరంరెడ్డి సూర్యనారాయణ, సబ్బవరం యూనిట్ మేనేజర్ ప్రభాకర్‌తో పాటు మిగిలిన సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఏఎంసీ స్నాతకోత్సవం



వైద్య విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జస్టిస్ సోమయాజులు

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవం, ఎంబీబీఎస్ 96వ స్నాతకోత్సవం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ఘనంగా జరిగాయి. 2017 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు, అధ్యాపకులకు ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు స్వాగతం పలికారు. రిటైర్డు డీఎంఈ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. శశిప్రభ, ఏఎంసీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ సుధాకర్ గౌరవ అతిథులుగా విచ్చేసి వైద్య వృత్తి ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ముఖ్య అతిథిగా హాజరై స్నాతకోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన 2017 ఎంబీబీఎస్ బ్యాచ్‌ను అభినందించారు. వైద్యులు మానవతా దృక్పథంతో రోగులకు సేవ చేయాలన్నారు. వైద్య విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. డాక్టర్ జి. రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ (అడ్మిన్) కొత్తగా ఉత్తీర్ణులైన మెడికల్ గ్రాడ్యుయేట్లతో ప్రమాణం చేయించారు. 2017 బ్యాచ్‌కు చెందిన ఇద్దరు ఉత్తమ విద్యార్థులు డాక్టర్ శ్యామా మదిన్య, డాక్టర్ డి.వైష్ణవి ప్రియాంక అధ్యాపకులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంబీబీఎస్ 2017 బ్యాచ్ పూర్వ విద్యార్థులు నిర్మిస్తున్న సెంటినరీ అకడమిక్ బ్లాక్ నిర్మాణానికి రూ. 2 లక్షల చెక్కును అందజేశారు.

ఆర్ఆర్ఆర్‌కు ఆస్కార్.. గొప్ప విజయం

- ప్రముఖ సంగీత దర్శకుడు తమన్


పూజలు నిర్వహిస్తున్న సంగీత దర్శకుడు తమన్

సింహాచలం: ఆర్ఆర్ఆర్ సినిమాకు ఆస్కార్ అవార్డు రావడంతో తెలుగు సినిమా స్థాయి ఉన్నత శిఖరాలకు వెళ్లిందని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు తమన్ అన్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం ఆయన దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా తమన్ మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్ సినిమాలో పాటకు ఆస్కార్ రావడం తెలుగు సినీ పరిశ్రమకు గొప్ప విజయమన్నారు. ప్రస్తుతం రామ్ హీరోగా.. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు సంగీత దర్శకత్వం వహిస్తున్నట్టు చెప్పారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, సంపంగి శ్రీనివాసరావు తమన్ వెంట ఉన్నారు.

కార్మికులను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం


కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం : శ్రామికుల కష్టాలను పట్టించుకోకుండా సొంత లాభం కోసం కేంద్ర ప్రభుత్వం వారిని విస్మరిస్తుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. ఈ మేరకు 772వ రోజు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన ఎస్.ఎం.ఎస్–2 విభాగం కార్మికులు కూర్చున్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు తోడ్పడకుండా రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాల నష్టాల్లోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలన్నారు. రానున్న కాలంలో ప్రజలను చైతన్యం చేసే విధంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఒక్క కార్టూన్‌తో అనేక భావాలు


కార్టూన్ వాచ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి తదితరులు

అల్లిపురం: ఒక్క కార్టూన్‌తో నవరసాలు పలికించవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. హాస్యం, వినోదం, రాజకీయం.. ఇలా ఏదైనా కార్టూన్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. మేఘాలయా హోటల్లో శనివారం జరిగిన కార్టూన్స్ వాచ్ కార్టూన్స్ ఫెస్టివల్–2023ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా కార్టూన్ వాచ్ పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్టూన్ వాచ్ ఫెస్టివల్‌ను విశాఖలో నిర్వహించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కార్టూన్ వాచ్ కుటుంబం ఎడిటర్ త్రయంబకశర్మను గౌరవించుకోవడం ముదావహం అన్నారు. ఛత్తీస్‌గఢ్‌టూరిజం ఎండీ అనిల్ సాహు, డీవీఆర్ మూర్తి మాట్లాడుతూ కార్టూన్లు ఎన్నో భావాలను తెలియజేస్తాయన్నారు. కార్టూనిస్టులు ఎం.శంకర్‌రావు, టి.వెంకటరావు, శ్రీహరి వెంకట రమణలకు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు.